: www.aknu.edu.in
: nannayavani@aknu.edu.in
: nannayanewstv
: Adikavi Nannaya University
: 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా. తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 సంచిక : 51 26-09-2022 పుటలు : 4




# విశ్వవిద్యాలయ సమాచారవాణి - నన్నయవాణి

మన దేశంలో ఏ విశ్వవిద్యాలయమైనా నలభై,యాభై పైబడిన విభాగాలతో నడుస్తుంది. దానికి తోడు ప్రత్యేకంగా విశ్వవిద్యాలయ ప్రాంగణాలు కొన్నిచోట్ల నడుస్తుంటాయి. వందలాది అనుబంధ కళాశాలలు ఉంటాయి. విశ్వవిద్యాలయం అంటే ఒక విస్తృతమైన విద్యావ్యవస్థ. ఇటువంటి వ్యవస్థలో ఎక్కడ ఏ మూలన ఏమి జరుగుతుందో ఆ వ్యవస్థలో పనిచేసే ఉద్యోగికి కూడా తెలియదు. విద్యార్థులు తమ క్లాస్, తమ విభాగం గురించే తెలుసుకోగలుగుతారు. ఏదైనా పెద్ద పెద్ద ఉత్సవాలు జరిగినప్పుడు విశ్వవిద్యాలయ స్వరూపం వారికి అవగతం అవుతూ ఉంటుంది.

విశ్వవిద్యాలయ సమాచారాన్ని అందరికీ తెలియడం కోసం సహజంగా విశ్వవిద్యాలయాలు హౌస్ జర్నల్స్, న్యూస్ లెటర్స్, న్యూస్ బులిటెన్ పేరుతో సమాచారాన్ని వెబ్సైట్లో నిక్షిప్తం చేసుకుంటూ ఆయా ఉద్యోగులకు విద్యార్థులకు తెలియజేస్తూ ఉంటాయి. దీని ద్వారా విశ్వవిద్యాలయ వ్యవస్థలోని సమాచారం అందులో పని చేసే ఉద్యోగులకు విద్యార్థులకు తెలుస్తుంది. IQAC, NAAC అవసరం కోసం ఇటువంటివి ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తాయి. అధికారుల సమావేశాలు, నిర్ణయాలు, విశ్వవిద్యాలయ ప్రగతి, అధ్యాపకుల విద్యార్థుల ఆవిష్కరణలు, రచనలు, పోటీపరీక్షల గురించిన సమాచారం కూడా ఇందులో నిక్షిప్తమై ఉంటుంది.

ఈ సంచికలు అమ్ముకోవటానికి, వ్యాపార ధోరణితో నడపటానికి ఉద్దేశించినవి కావు. అందుకే వీటికి ధర కూడా ఉండదు. పూర్తిగా ఉచితం. ఆన్లైన్ లో మొబైల్ లో, ఇంటర్నెట్లో వీటిని చూడవచ్చు. ఆంధ్ర విశ్వవిద్యాలయం' ఏ యు లుక్స్' పేరుతో వేమన విశ్వవిద్యాలయం 'వేమనవాణి ' పేరుతో శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన సంస్థ ' షార్ వాణి ' పేరుతో మరికొన్ని విశ్వవిద్యాలయాలు ' న్యూస్ లెటర్స్' ' న్యూస్ బులిటెన్ ' ' హౌస్ జర్నల్ ' పేరుతో తమ సంస్థ సమాచారాన్ని భద్రపరుచుకుంటున్నాయి. ఇదే మార్గంలో నన్నయ విశ్వవిద్యాలయం కూడా 'నన్నయవాణి' పేరుతో సమాచారాన్ని భద్రపరుచుకుంటుంది. ఇదంతా సర్వసాధారణమైన నిరంతర ప్రక్రియ. ఇలా భద్రపరచడం మూలాన ఏ సమాచారం కావాలన్నా వెబ్సైట్లో వెంటనే లభిస్తుంది. అది ఆ సంస్థకే కాదు, ప్రపంచంలో ఎక్కడున్నా తెలుగువారికి కూడా ఉపయోగపడుతుంది.

నన్నయ విశ్వవిద్యాలయం 2020 అక్టోబర్ 2 గాంధీ జయంతి రోజున నన్నయవాణి పేరుతో నాలుగు పుటలతో ఈ న్యూస్ బులిటెన్ ను ప్రవేశపెట్టింది. విశ్వవిద్యాలయం స్థాపించిన 2006 నుండి కూడా న్యూస్ లెటర్స్ ప్రచురించింది. ఈ క్రమంలో ప్రతివారం నన్నయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం ప్రధాన ప్రాంగణం, కాకినాడ, తాడేపల్లిగూడెం క్యాంపస్ కళాశాలల్లో సమాచారాన్ని భద్రపరచడానికి నన్నయవాణి ప్రధాన వాహిక అయింది. కోవిడ్ సమయంలో విద్యార్థులకు అధ్యాపకులకు సమాచారాన్ని అందించటానికి విశేషమైన కృషి చేసింది.


విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేలా కవితా రచన, వ్యాసరచన, చిత్రలేఖనం, పుస్తక సమీక్షలను ప్రోత్సహిస్తూ ప్రచురిస్తుంది. ఒక సూక్తిని, సంపాదకీయాన్ని అందిస్తోంది. ప్రముఖుల జయంతి, వర్ధంతుల సమయంలో ప్రతిభావాణి పేరుతో వారి గురించిన సమాచారాన్ని ఇస్తోంది. పోటీ పరీక్షల సమయంలో బిట్ బ్యాంక్ ను అందిస్తోంది. ఈ సంచిక కోసం అధ్యాపకులు, విద్యార్థులు అదనపు బాధ్యతతో తమ సమయాన్ని కేటాయిస్తూ ఉచిత సేవలు అందిస్తున్న విషయం అందరికీ తెలిసిందే.

ఫోటోషాప్ లో వర్క్ చేసి ప్రతివారం అందంగా విశ్వవిద్యాలయ సమాచారాన్ని అందించి విద్యార్థులకు అందుబాటులో ఒక ప్రింట్ తీసి నోటీసు బోర్డులో ఉంచుతోంది. ఒక నెలకు నాలుగు లేదా ఐదు సంచికలకు అవుతున్న మొత్తం వ్యయం 2800 (అక్షరాల ఇరవై ఎనిమిది వందల రూపాయలు మాత్రం) అతి తక్కువ ఖర్చుతో విశ్వవిద్యాలయ సమాచారాన్ని మరిన్ని మంచి విషయాలను అందిస్తున్న నన్నయవాణి అతి తక్కువ కాలంలో ప్రముఖుల, విద్యావేత్తల ప్రశంసల్ని పొందింది.

**నన్నయవాణి విశ్వవిద్యాలయ సమాచార సంచిక రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని మూడవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సహాయ సహకారాలను అందిస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.**

**- సంపాదకులు**

# సంపాదకీయం




## ఆత్మకథలు

అక్షరానికి ఒక అపురూపమైన శక్తి ఉంది. స్ఫూర్తినిచ్చే గుణముంది. పుస్తకాల్లో దాగి ఉన్న అక్షరాలన్నీ ఆత్మకి ఔషధాలే. అవి కాలసాగర తీరాన దారిచూపే లైట్ హౌస్ లే! పుస్తకాలు అనేసరికి గ్రంథాలయపు అరల్లో, పుస్తకాల దుకాణాల్లో కనిపించే కొన్ని జీవిత చరిత్రలు,వాటిపై మహనీయుల ముఖచిత్రాలు మనలో చైతన్యాన్ని కలిగించేలా దర్శనమిస్తాయి. స్వీయ చరిత్రలు, ఆత్మకథలు, జీవిత చరిత్రలు మన జీవితాల్ని దీప్తిమంతం చేసుకోవడానికి స్ఫూర్తిమంతంగా నిలుస్తాయి.

వర్తమానాన్ని పరిపూర్ణంగా అనుభవించాలంటే, సరిగ్గా అర్థం చేసుకోవాలంటే చరిత్రలోనికి ఒకసారి తొంగిచూడాలి. ఈ సమాజంలోని మనుషుల వైరుధ్యాలని, వైవిధ్యాలని ఆకలింపు చేసుకునేందుకు చరిత్ర చాలా అవసరం. జీవిత చరిత్రలంటే ఒకనాటి సమాజం. గతాన్ని పరిచయం చేసి వర్తమానంలో మరింత బాధ్యతాయుతంగా, మానవీయంగా వ్యవహరించటానికి అవి ఎంతగానో ఉపకరిస్తాయి.

ఎవరి జీవితం, అనుభవం వారిదే. కానీ కొంతమంది అనుభవాలు ఇప్పుడున్న సమాజానికి సంస్కారాన్నందిస్తాయి. సమాజం పట్ల ప్రేమతో, దయతో వ్యవహరించడానికి ఉత్తేజాన్నిస్తాయి. మనిషి మనీషిగా మారటానికి ప్రేరణనిస్తాయి. అందుకనే జీవిత చరిత్రలు కేవలం గడిచిపోయిన కాలానికి సంబంధించిన రికార్డులు కావు. మనల్ని మనం మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవటానికి తోడ్పడే ఉత్తమ గ్రంథాలు.

గాంధీజీ తన బాల్యంలో, కౌమారంలో, తొలి యవ్వన ప్రాయంలో చేసిన పొరపాట్లను నిస్సంకోచంగా "సత్యశోధన" లో రాశారు. తమ లోపాల్ని పొరపాట్లని చెప్పడం ద్వారా ఇతరులు వాటిని పునరావృతం చేయకుండా ఉంటారనే ఆశ కూడా అందులో ఉంది. అందుకనే తమకు తెలిసిన జీవితాన్ని తాము చెప్పటంతో, మట్టిలో కలిసిపోయే వాస్తవాన్ని చెప్పటంతో కొన్ని చరిత్రలు ప్రపంచాన్ని కదిలించాయి. చదవగలిగితే ప్రతి జీవితం ఓ చరిత్రే కదా!

ఫిన్లాండ్ రచయిత ' కల్లేపాటలో ' 17 వేల పేజీలతో 26 సంపుటాలుగా ఇజొకి (నది) పేరుతో 27 ఏళ్లు ఆత్మకథను రాశాడు. ఒక్క మాటలో చెప్పాలంటే అది ఆ దేశచరిత్ర.

తెలుగులో కందుకూరి, చిలకమర్తి స్వీయ చరిత్రలు, తిరుమల రామచంద్ర 'హంపి నుంచి హరప్పా దాకా', శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అనుభవాలు – జ్ఞాపకాలూనూ, శ్రీశ్రీ ' అనంతం ' కాళోజి ' నాగొడవ ' టంగుటూరి ప్రకాశం ' నా జీవిత యాత్ర ' ఉప్పల లక్ష్మణరావు ' బతుకు పుస్తకం ' వంటివన్నీ తెలుగు నాట సామాజిక పరిణామాల్ని విశ్లేషించాయి.

నెహ్రూ,నెల్సన్ మండేలా, కిరణ్ బేడీ, అబ్దుల్ కలాం, పరమహంస యోగానంద, వారెన్ బఫెట్ వంటి వారి జీవితాల్లో గెలుపు ఓటములు ఏ విధంగా ఉన్నాయో తెలియటంతో పాటు ఆత్మాభిమానం,రాజీపడని నిబద్ధత, కష్టాలను ఎదుర్కొన్న తీరు, నిజాయితీ వంటివన్నీ మనకు అవగతమవుతాయి.

మనిషిగా మెలుగుతూ, మాట మీద నిలబడుతూ ఎంచుకున్న దారిలో ఎదిగే తత్వాన్ని స్వీయ చరిత్రలు, జీవిత చరిత్రలు మనకు నేర్పుతాయి. ఏదైనా ఒక జీవిత చరిత్రను మనసుపెట్టి చదివి చూడండి. ఒక కొత్త అంశాన్ని, కొత్త ఆలోచనని, కొత్త ఆశయాన్ని మీకందిస్తుంది. ఆ దిశగా నడిపిస్తుంది. ఇది నిజం.

# వీసీని కలిసిన ఇంటిలిజెన్స్ మాజీ డి.ఎస్.పి. శ్రీరామమూర్తి


శ్రీరామమూర్తిని సన్మానిస్తున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును ఇంటిలిజెన్స్ మాజీ డి.ఎస్.పి. శ్రీరామమూర్తి మర్యాదపూర్వకంగా కలిసారు. రాజమండ్రిలో నివసిస్తున్న మాజీ డి.ఎస్.పి శ్రీరామమూర్తి ఇంటిలిజెన్స్ విభాగంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో సేవలందించారని వీసీ జగన్నాథరావు తెలియజేసారు. ఈ సందర్భంగా శ్రీరామమూర్తి మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు నాయకత్వంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రగతిపథంలో పయనిస్తుందన్నారు. కోవిడ్ సమయంలో సరైన నాయకత్వంతో విశ్వవిద్యాలయాన్ని విద్యాపరమైన ప్రగతిలో నడిపించారన్నారు. యూనివర్సిటీకి ఐ.ఎస్.ఓ, ఎ.ఐ.సి.టి.ఇ. గుర్తింపులు సాధించారన్నారు. ప్రస్తుతం నాక్ సాధన దిశగా కృషి చేస్తున్న వీసీ జగన్నాథరావుకు అభినందనలు తెలియజేసారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. రాజమండ్రిలో నివసిస్తున్న శ్రీరామమూర్తి గోదావరి ప్రాంత విశ్వవిద్యాలయమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిని చూసి ఆనందాన్ని వ్యక్తం చేసారు. తరువాత వీసీ జగన్నాథరావు శ్రీరామమూర్తిని సన్మానించి అభినందించారు.

# నన్నయలో ఎగ్జిక్యూటివ్, ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్స్

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్ మరియు ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్ లను ప్రవేశపెడుతున్నామని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేసారు. 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నూతన ఎంబీఏ ప్రోగ్రామ్స్ ను ప్రవేశపెడుతున్నామని అన్నారు. రెండు సంవత్సరాల ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ ప్రోగ్రామ్ కు సంబంధించి ఏదైన డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో రెండు సంవత్సరాలు అనుభవం కలిగిన వారు అర్హులని తెలిపారు. ఐదు సంవత్సరాలు ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ ప్రోగ్రామ్ కు 10o2 లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని చెప్పారు. ఈ నెల 26వ తేదీ నుండి అక్టోబర్ 10వ తేదీ వరకు ఆన్లైన్ దరఖాస్తులను స్వీకరిస్తారని, అక్టోబర్ 20వ తేదీన కౌన్సిలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయాన్ని లేదా యూనివర్సిటీ వెబ్ సైట్ www.aknu.edu.inను సంప్రదించాలని తెలియజేసారు.

# గూడెం క్యాంపస్‌లో అవగాహనా సదస్సు



**22.09.22 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ప్రాంగణంలో గురువారం "హౌ టు గ్రూమ్ ఎంటర్ప్రెన్యూర్స్" అనే అంశం మీద అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ప్రిన్సిపాల్ ఆచార్య. కొట్టి శ్రీ రమేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య వక్తగా APCIMSME రాష్ట్ర చైర్పర్సన్ మరియు యాస్మీ సోలుషన్స్ వ్యవస్థాపకురాలు డా. గీతారెడ్డి పాల్గొన్నారు.వక్తలు మాట్లాడుతూ ప్రస్తుత దేశ అవసరాలు తీరడానికి, ఆర్థిక ప్రగతి సాధించాలంటే, యువత ఉద్యోగాలు ఆశించే స్థాయి నుంచి ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ క్రమంలో విద్యార్థులు అలవరుచుకోవలసిన వినూత్న విధానాలు, మెరుగైన స్టార్ట్ అప్స్ కోసం అనుసరించాల్సిన వ్యాపార వ్యూహాలను డా. గీతారెడ్డి వివరించారు. స్టార్ట్ అప్, ఇంక్యూబేషన్ సెంటర్, కాలేజీలలో ఇంక్యూబేషన్ సెంటర్ల ఆవశ్యకత గురించి, స్టార్ట్ అప్ మొదలుపెట్టడానికి, అవసరం అయిన మెంటరింగ్, ఇన్వెస్టింగ్, కన్సల్టింగ్, లీన్ కాన్వాస్ అండ్ పిచ్ డెస్క్ గురించి వివిధ ఉదాహరణలతో విశ్లేషించారు. పుట్టుకతో ఎవరు పారిశ్రామికవేత్తలు కారు, మనిషి తన చుటూ వున్న సామాజిక అవసరాలను గమనిస్తూ వాటిలోనుంచి వివిధ ఆదాయ వ్యాపార మార్గాలు అన్వేషించాలని టీ, టైం స్టార్ట్ అప్, కేఫ్ కాఫీ డే స్టార్ట్ అప్, ఎడిబుల్ టీ కప్, వెనిక హెర్బల్ ప్రొడక్ట్స్ గురించి సోదాహరించారు. డా. గీతారెడ్డి సుమారు రెండు గంటల పాటు విద్యార్థులతో ఇష్టగోష్టి నిర్వహించారు. ఇష్టగోష్టి లో విద్యార్థులు వివిధ ఉపాధి విధానాల ఆలోచనలు ఆమెతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధి ఆలోచన మార్గాలు వ్యక్త పరిచిన విద్యార్థులు దేవి (ఫార్మసీ డిపార్ట్మెంట్) మరియు చంద్రశేఖర్లకు (ఎంబీఏ డిపార్ట్మెంట్) ప్రశంసాపత్రం ప్రదానం చేసారు. సదస్సులో, ప్రాంగణ ఉపాధ్యాయులు, కెమిస్ట్రీ, ఫార్మసీ, ఫిజిక్స్ మరియు ఎంబీఏ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేసారు.

(సెప్టెంబర్ 27)

## ప్రపంచ పర్యాటక దినోత్సవం


(పర్యాటకం - పునరాలోచన 2022 థీమ్)




నేను ప్రపంచాన్ని
నింగి, నేల, నీరు,గాలి అన్నీ కలిసిన సౌభాగ్యాన్ని
అనాదిగా చిరంజీవిని
సకల జీవులకు
జన్మనే కాదు జీవితాన్ని
అందించినదాన్ని
తరతరాలకు ప్రకృతి అందాలని అందించినదాన్ని
జీవితాలనిండా ఇంద్రధనస్సులను నింపినదాన్ని
కాసేపు మీ ఒత్తిడి నుంచి
హాయిగా ఆనందంగా
ప్రకృతిలో పర్యటించు!
ప్రశాంతంగా జీవించు!!

ఎమ్.బి.ఏ (టూరిజం & హాస్పిటాలిటి) విభాగం
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం


## మంచి మాట



స్వప్నించు. స్వప్నాలు భావాలుగా మారతాయి.
భావాలు కార్యాచరణగా ఫలిస్తాయి.

- అబ్దుల్ కలాం

కులమతాలుగీచుకున్న గీతలజొచ్చి
పంజరాన కట్టువడను నేను
నిఖిలలోకమెట్లు నిర్ణయించిన నాకు
తిరుగులేదు విశ్వనరుడ నేను



గుంటూరు జిల్లా వినుకొండలో పుట్టి విశ్వనరునిగా ఎదిగిన గుర్రం జాషువా గారి జయంతి సెప్టెంబర్ 28. తెలుగు సాహిత్యంలో భావ కవితోద్యమ వీచికలు ఉధృతంగా వీస్తున్న కాలంలో తనదైన ప్రతిభతో తన భావవ్యక్తీకరణకు పద్యాన్ని సాధనంగా చేసుకొని రచనలు చేసిన నవయుగ కవిచక్రవర్తి, మానవతావాది గుర్రం జాషువా. పద్యం ఆయన మాతృభాష! పేదల కష్టాలు,కన్నీళ్లు ఆయన కళ్ళజోడు! ఆ కళ్ళజోడులోంచి చూసి ఆయన కవిత్వాన్ని రచించారు.

పద్మభూషణ్ గుర్రం జాషువా జయంతి శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

## షహీద్ భగత్ సింగ్ జయంతి

(సెప్టెంబర్ 27)



ఇంక్విలాబ్ జిందాబాద్!

భగత్ సింగ్ సమాధి పేరు
తేజ్ మహల్!
అది విప్లవకారుల శరతల్పం!
తేజ్ మహల్ వేదికపై ఒకే ఒక్క విప్లవ మంత్రం...
"సర్ ఫరోషీకి ఆజ్ తమన్నాహై దిల్ మే దేఖా కిత్నా జోర్ హై బర్‌ఝూ - ఇ కాతర్ మే."
తెల్లదొరలకు ఒక సూటి ప్రశ్న:
"దేశంకోసం ఈ ఉరికంబాన్ని ముద్దాడి ప్రాణాలు అర్పించే ధైర్యం నాకుంది.ఈ ధైర్యం మీకుందా?"
రాజగురు, సుఖదేవ్ భగత్ సింగ్ కి అటూ ఇటూ దేశభక్తిని,విప్లవాగ్నిని రగిలించిన చోటు తేజ్ మహల్!!

తేజ్ మహల్ కి నమస్కరిస్తూ....

- నన్నయవాణి

## నన్నయ వీసీని కలిసిన ఆచార్య మురళీకృష్ణ


మురళికృష్ణను జ్ఞాపికను అందిస్తున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావును భారతప్రభుత్వ రాజారామన్న డి.ఆర్.డి.ఓ మాజీ విశిష్ట సహచరులు ఆచార్య ఐ.వి.మురళికృష్ణ మర్యాదపూర్వకంగా కలిసారు. దీనికి సంబంధించిన వివరాలను వీసీ తెలియజేస్తూ ఆచార్య ఐ.వి.మురళికష్ణ రాజారామన్న డి.ఆర్.డి.ఓ మాజీ విశిష్ట సహచరులుగా, ప్రొఫెసర్ అండ్ డైరెక్టర్ (ఆర్.డి) జె.ఎన్ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ మరియు అనుబంధ ప్రొఫెసర్ ఏషియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ బ్యాంకక్ కు సేవలందిస్తున్నారని తెలిపారు. మురళికృష్ణ టీచింగ్ లోను, పరిశోధనలలోను విశిష్ట అనుభవాన్ని సంపాదించుకున్నారన్నారు. మురళికృష్ణ శాస్త్రీయ పరిశోధనలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. రిమోట్ సెన్సింగ్, జి.ఐ.ఎస్., ఇమేజ్ ప్రోసెసింగ్ వంటి ఆవిష్కరణలు ప్రత్యేకత సాధించారన్నారు. ఈ సందర్భంగా మురళికృష్ణ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. విశ్వవిద్యాలయాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి పూర్తి సహాయసహకారాలను అందిస్తానని తెలియజేసారు. తరువాత వీసీ జగన్నాథరావు ఆచార్య మురళికృష్ణకు నన్నయ జ్ఞాపికను అందించి సన్మానించి అభినందించారు.

## గూడెంలో రాకెట్ సైన్స్ పై అవగాహన



ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్, తాడేపల్లిగూడెం, డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజిక్స్ వారు "రాకెట్ సైన్స్ పై విద్యార్థుల అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ యాళ్ల శివ ప్రసాద్ హాజరై అతిథి ఉపన్యాసాలు ఇచ్చారు. తన ఉపన్యాసంలో రాకెట్ సైన్స్ బేసిక్స్, రాకెట్ సైన్స్ పై ప్రయోగాలు, ఉపగ్రహాలు మరియు కక్ష్యల అనువర్తనాల గురించి చర్చించారు. యాళ్ల శివప్రసాద్ గతంలో 232 అతిథి ఉపన్యాసాలు అందించారని, ఇది 233వ ఉపన్యాసమని అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీకి చెందిన ఎంబీఏ, ఎమ్మెస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బీ ఫార్మసీ విద్యార్థులు, మరియు యూనివర్సిటీ అనుబంధ కళాశాల యైన ఆదిత్య డిగ్రీ కళాశాల తాడేపల్లిగూడెం, డిగ్రీ సైన్స్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులందరూ ఉత్సాహంగా హాజరయ్యారు. ప్రిన్సిపల్ ప్రొఫెసర్ శ్రీరమేష్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. హాజరైన విద్యార్థులందరికీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీరమేష్ మరియు రిసోర్స్ పర్సన్ యాళ్ల శివ ప్రసాద్ పాల్గొని సర్టిఫికెట్లు అందించారు. ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ, కోర్సు కోఆర్డినేటర్ మరియు ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఎఫ్రాయిము బాబు, కన్వీనర్ డాక్టర్ కెవిఎస్ఎన్ రాజు, జి.సత్యనారాయణ మరియు అన్ని విభాగాల కోర్సు కోఆర్డినేటర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# గూడెం క్యాంపస్ విద్యార్థులకు అభినందనలు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్, తాడేపల్లిగూడెంలో ఎమ్మెస్సీ(ఫిజిక్స్) ద్వితీయ సంవత్సరం చదువుతున్న బీవీఎస్ దుర్గా రాగిణి రాష్ట్ర స్థాయి జాతీయ అన్వేషిక ప్రయోగ నైపుణ్య పరీక్ష-22లో తృతీయ స్థానంలో నిలిచింది. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ మరియు నేషనల్ అన్వేషిక నెట్వర్క్ ఆఫ్ ఇండియా (NANI), IIT, కాన్పూర్ వారు ప్రయోగాత్మక భౌతిక శాస్త్ర పరీక్షలు ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. దీనిలో భాగంగా, ఈ విద్యా సంవత్సరం రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రాథమిక పరీక్షలో దుర్గా రాగిణి అర్హత సాధించారు. విజయనగరంలోని ఆర్కె జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో జరిగిన తదుపరి స్థాయి లో 1, 2, 3 లెవెల్స్ దాటి చివరకు సీనియర్ స్థాయిలో 3వ స్థానం సాధించింది. నిర్వాహకులు మెరిట్ సర్టిఫికేట్, జ్ఞాపిక మరియు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్, తాడేపల్లిగూడెం లో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె. శ్రీరమేష్ మరియు ఫిజిక్స్ డిపార్ట్మెంట్ ఫ్యాకల్టీ, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.ఎఫ్రాయిము బాబు, డాక్టర్ కెవిఎస్ఎన్ రాజు, జి.సత్యనారాయణ విజేత దుర్గా రాగిణిని అభినందించారు.

# తరగతి బోధనలో వీసీ జగన్నాథరావు



21.09.22 (మీడియాసెల్) ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ప్రొఫెసర్ గా యూనివర్సిటీ విద్యార్థులకు పాఠాలు బోధించారు. బుధవారం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జియో సైన్సెస్ విభాగంలోని వీసీ జగన్నాథరావు క్లాస్ చెప్పారు. జియాలజీ, జియోఫిజిక్స్‌కు సంబంధించిన ప్రధాన పాఠ్యాంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. దేశాభివృద్ధిలో జియాలజీ పాత్ర ఎంతో కీలకమని తెలియజేసారు. భూగర్భశాస్త్ర అధ్యయనం, ఖనిజాన్వేషణలు, ఎర్త్ సైంటిస్ట్, భూగర్భ శాస్త్రవేత్తలుగా ఉన్నత స్థానాలను చేరుకొనే అవకాశాలపై మార్గనిర్దేశం చేసారు. పర్యావరణం, రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటి అప్లికేషన్స్ గూర్చి వివరించారు. జియాలజీలో ఇటీవల సాధించిన అప్డేట్స్ ను, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు ఉండే అవకాశాలను వివరించారు. అనంతరం జియోసైన్సెస్ విద్యార్థులు వీసీ జగన్నాథరావుకు కృతజ్ఞతలు తెలియజేసారు. వీసీ జగన్నాథరావు ఆచార్యునిగా జియో సైన్సెస్ విద్యార్థులకు చక్కని విషయాలను తెలియజేసారని అధ్యాపకులు అభినందించారు.




# నన్నయ వీసీని కలిసిన టి.సి.ఎస్ ప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

22.09.22 (మీడియాసెల్) ఆంధ్రప్రదేశ్ నూతన విద్యామార్గదర్శకాలలో భాగంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో విద్యార్థులందరికీ చక్కని ఇంటెన్షిప్ లు అందించాలని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈసీ హాల్ లో గురువారం వీసీ జగన్నాథరావును టి.సి.ఎస్ ప్రతినిధులు కలిసారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇంటెన్షిప్ కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున జరుగుతున్నాయని ఈ క్రమంలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల డిగ్రీ విద్యార్థులకు ఇంటెన్షిప్ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు.డిగ్రీ విద్యార్థులకు ఇంటెన్షిప్ అవకాశాలు కల్పించేందుకు వికాస సంస్థ ఎంతో సహకారాన్ని అందిస్తుందని అన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోని వికాస సంస్థ ద్వారా ఇంటెన్షిప్ లు కల్పించేందుకు టి.సి.ఎస్ సంస్థ ముందుకు వచ్చిందని తెలిపారు. జిల్లాలోని డిగ్రీ విద్యార్థులకు టి.సి.ఎస్ సంస్థ రెండు నెలల పాటు సాఫ్ట్ వేర్ టూల్స్ పై శిక్షణ అందిస్తుందన్నారు. వికాస సంస్థ అనుభవాలు జిల్లాలోని విద్యార్థులకు చక్కని ఇంటెన్షిప్ లు కల్పించేందుకు దోహదపడుతున్నాయని, అలాగే మిగిలిన జిల్లాల్లోను ప్రముఖ ప్రైవేటు సంస్థల ద్వారా ఇంటెన్షిప్ అవకాశాలు కల్పించాలన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంటెన్షిప్ కార్యక్రమాలలో సహకరిస్తున్న కలెక్టర్ మాధవీలత, వికాస సంస్థ సభ్యులను వీసీ అభినందించారు. భవిష్యత్తులో యూనివర్సిటీ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు, ట్రైనింగ్ కం ప్లేస్మెంట్స్ అందించేందుకు సహకరించాలని టి.సి.ఎస్ ప్రతినిధులను వీసీ కోరారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య పి.సురేష్ వర్మ, డా.వి.పెర్సిస్, టి.సి.ఎస్ సౌత్ మేనేజర్ షీనా మాథ్యూ, రీజినల్ హెడ్ ఎల్.రవి, సాయి సుస్మిత, వి.శరణ్య, వికాస పిడి కె.లచ్చారావు, మేనేజర్ పి.శ్రీకాంత్, కె.శర్మ తదితరులు పాల్గొన్నారు.

# డిపార్ట్మెంట్ లైబ్రరీ ప్రారంభం



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ వారు విద్యార్థుల సౌకర్యార్థం డిపార్ట్మెంట్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. క్యాంపస్ ప్రిన్సిపల్ డా. ఎం.కమల కుమారి ముఖ్య అతిథిగా రిబ్బన్ కత్తిరించి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ హెచ్ ఓడి డా. అజయ్ రతన్, డిపార్ట్మెంట్ అధ్యాపకులు డా.శ్రీరామరాజు, అనిలాంబిక, మధు కుమార్, అప్పారావు, మణికంఠ, మనోజ్ , రజిత, ప్రస్తుత విద్యార్థులు మరియు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# బిఈడీ మూల్యాంకనాన్ని పరిశీలించిన వీసీ



ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లోని బిఈడీ నాలుగవ సెమిస్టర్ మూల్యాంకన కేంద్రాన్ని వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పరిశీలించారు. పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని నిర్వహిస్తున్న అధ్యాపకులకు, నిర్వాహకులకు వీసీ పలు సూచనలందించారు. ఈ సందర్భంగా వీసీ వివరాలను తెలియజేస్తూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న ఎడ్యుకేషన్ కళాశాలలకు సంబంధించిన నాలుగవ సెమిస్టర్ పరీక్ష పత్రాల మూల్యాంకనాన్ని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారన్నారు. ఆగష్టు 24వ తేదీ నుండి 27వ తేదీ వరకూ బిఈడీ విద్యార్థులకు పరీక్షలు జరిగాయని వీటికి సంబంధించి 7460 పరీక్ష పత్రాలను మూల్యాంకనం చేస్తున్నారని చెప్పారు. భావితరాల ఉపాధ్యాయులను తయారు చేసే ఉపాధ్యాయులు సమర్థవంతంగా పరీక్షపత్రాలను మూల్యాంకనం చేయాలన్నారు. బిఈడీ పూర్తి చేసుకొని ఎంఈడీ, పీజీ లలో ప్రవేశాలకు వెళ్ళే విధంగా విద్యార్థులకు సకాలంలో ఫలితాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.కె.సుబ్బారావు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

### డీఎస్సీకి ఎన్నికైన అధ్యాపకులకు అభినందనలు

1989 డీఎస్సీలో ఉద్యోగమునకు ఎన్నికైన అభ్యర్థులు వై. హేమంత్ కుమార్,డిఎన్ఆర్ కాలేజ్ భీమవరం, డి. సూర్యప్రకాశరావు ఎస్ కే బి ఆర్ కాలేజ్ అమలాపురం, కె. కృష్ణ వివిఎస్ కాలేజ్ ఉప్పాడలను మూల్యాంకన సమయంలో ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు సన్మానించి అభినందించారు.

# కోరంగిని సందర్శించిన కాకినాడ విద్యార్థులు



ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ డిపార్ట్మెంట్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ వారు విద్యార్థులతో ఓపెన్ ఎయిర్ క్లాసు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో పర్యావరణం పట్ల అవగాహన కల్పించడానికి మరియు పర్యావరణ పరిరక్షణకు ఏ విధంగా పాటుపడాలో తెలియజేయటానికి ఎకో ఫ్రెండ్లీ క్లాసుని కోరంగి మడ అడవిని విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా యాత్రను ప్రారంభించిన క్యాంపస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. కమలకుమారి మాట్లాడుతూ ఇలాంటి ప్రకృతిని సందర్శించి నేర్చుకునే కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రకృతి పట్ల అవగాహన మరియు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని నదీ ప్రవాహానికి రక్షణ గోడగా ఉన్న కోరంగి లాంటి మడఅడవులు మనకి దగ్గరలో ఉండడం మన అదృష్టం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ హెడ్ డా.అజయ్ రతన్, అధ్యాపకులు శ్రీరామరాజు, అనిలాంబిక, మధుకుమర్, మణికంఠ,మనోజ్ మరియు ఎంబీఏ ఎంకాం విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in